క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో ఉప కమిషనర్



ఉప కమిషన్ గురుప్రసాద్‌ను సన్మానిస్తున్న అధికారులు, అర్చకులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆదివారం దేవాదాయశాఖ ఉప కమిషనర్ గురుప్రసాద్ దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఉప కమిషనర్ గురుప్రసాద్‌కు తీర్థప్రసాదాలు అందించారు. శేషవస్త్రాలతో ఆయనకు సన్మానించారు. అనంతరం ఆలయం ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓ రామక్రిష్ణ అర్చకులు నారాయణస్వామి, వీరయ్యస్వామి, సురేష్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన కుమారస్వామి

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయని హైవే పోలీసులు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన కుమారస్వామి బైక్‌పై యూటర్న్ తీసుకుంటుండగా కింద పడ్డారన్నారు. కుమారస్వామిని ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



ఎల్.తాండలో నాటుసారా బట్టీలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలంలోని ఎల్.తాండలో ఆదివారం సెబ్, వెల్దుర్తి పోలీసులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉన్న 1,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 35లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సెబ్ సీఐ రామాంజినేయులు తెలిపారు. దాడుల్లో కర్నూలు సీఐ రాజేంద్రప్రసాద్, వెల్దుర్తి ఎస్ఐ సునీల్‌కుమార్, సెబ్ ఎస్ఐలు అలీబేగ్, పృథ్వీ, రహనాబేగం, సిబ్బంది హనుమంతు, వెంకటేశ్వనాయక్, అన్సర్‌బాషా, విరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో ఉచిత వైద్యశిబిరం



ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కల్లూరు: శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి జయంతిని పురస్కరించుకుని స్థానిక కల్లూరులో లైఫ్ హోమియోపతి వారి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారికి హోమియో వైద్యులు శిరీషారెడ్డి ఆధ్వర్యంలో విషజ్వరాల నివారణకు మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధుల గురించి డాక్టర్ హరిప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యనిర్వాహకులు ఈశ్వర్ పాల్గొన్నారు.

కోలుకోలేక బాలుడు మృతి



మృతుడు మనోజ్ (ఫైల్)

సి.బెళగల్: తల్లిదండ్రులు చదువుకోవాలని సూచించడంతో పురుగు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలుడు కోలుకోలేక మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పలుకుదొడ్డి గ్రామంలో నివాసముండే ఈడిగా శేఖర్, ఉరుకుందమ్మ దంపతుల ఏకైక కుమారుడు మనోజ్ (15) పదవ తరగతి ఫెయిల్ అయ్యి ఇంటిపట్టునే ఉంటున్నాడు. అయితే తిరుగుల్లుమాని చదుకుని పద్దతిగా మసులుకోవాలని తల్లిదండ్రులు జులై 12న మందలించడంతో మనస్తాపానికి గురైన బాలుడు అదే రోజు రాత్రి పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మనోజ్ కోలుకోలేక ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు.

శ్రీఆంజనేయం..ప్రసన్నాంజనేయం!

- భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు



హోమాది పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఓర్వకల్లు: ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆశాడ మాసం, ఆదివారం, అమావాస్యను పురస్కరించుకుని భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం ఓర్వకల్లుతోపాటు గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుడుంబాయి తండా, బొడ్డువానిపల్లె, కాల్వ గ్రామాల శివారు ప్రాంతాలలో వెలసిన కొమ్ముచెరువు ఆంజనేయస్వామి, వీరాంజనేయస్వామి, కోనేటి ఆంజనేయస్వామి దేవస్థానాలలో అర్చకులు స్వాముల వారికి అభిషేకం, సింధూరం అలంకరణ, పుష్పాలంకరణ గావించి విశిష్ట పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీఆంజనేయం..ప్రసన్నాంజనేయం అంటూ గోవిందనామం స్మరించుకున్నారు. బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఓర్వకల్లు మండలంతోపాటు కర్నూలు, కల్లూరు, వెల్దుర్తి మండలాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు ఆలయ ఎదురుగా హోమంలో కొబ్బరిగిన్నెలు వేసి పూజలు నిర్వహించారు. భజన కళాకారులు ఆలపించిన గీతాలతో మారుమోగాయి. ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం తదితరులు స్వాముల వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే గౌరు చరితను దుశ్శాలువాలతో సన్మానించి, స్వాముల వారి చిత్రపటాన్ని బహూకరించారు.

ఇరు కమిటీల మధ్య వాగ్వాదం

బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి దేవస్థానంలో ఇరు కమిటీల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఆలయ అభివృద్ధి కోసం మొదట జనార్దన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, పుల్లారెడ్డితో పాటు మరికొందరు కమిటీ సభ్యులుగా పనిచేశారు.



స్వాముల వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఆ తర్వాత భైరాపురం గ్రామానికి చెందిన పరమేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డితో పాటు మరికొందరు కమిటీ నిర్వాహకులుగా వ్యవహరించారు. స్వాములవారికి పూజా కార్యక్రమాలు తమ ఆధ్వర్యంలోనే జరగాలని ఇరు కమిటీల సభ్యులు వాదనకు దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇరు వర్గాలకు అక్కడున్న వ్యక్తులు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమనుగింది.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

ఘనంగా చౌడేశ్వరి దేవి జయంతి

కల్లూరు: కల్లూరులో వెలిసిన చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మహాభిషేకం, లక్ష పుష్పార్చన, కుంకుమార్చన నిర్వహించారు. భజన భక్త బృందం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

అలరించిన నృత్య రూపక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: గురు పౌర్ణమి సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం సౌజన్యంతో ఆదివారం రాత్రి సీ క్యాంప్‌లోని కళాక్షేత్రంలో ప్రదర్శించిన షిరిడీ సాయిబాబా నృత్య రూపకం అలరించింది. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కర్నూలు సాయి భక్తులచే ఈ నత్య రూపకాన్ని మొదటిసారి షిరిడీలో ప్రదర్శించడం జరిగిందన్నారు. అక్కడి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. రెండో ప్రదర్శన కర్నూలులో జరిగిందన్నారు. 120 మంది కళాకారులు సాయి బాబా జీవితాన్ని సంపూర్ణంగా ప్రదర్శించి మెప్పించారన్నారు. కళాక్షేత్రం తరపున కార్యక్రమ నిర్వాహకులు మహాబలేష్, చింతా శ్రీనివాస్‌కు రూ.40 వేలు అందజేశారు. అంతకుముందు కూచిపూడి సిద్ధేంద్ర నృత్య కళాశాల ప్రన్సిపాల్ వేదాంతం రామలింగేశ్వర శాస్త్రి, కర్నూలు నగర పాలక సంస్థ మేనేజర్ చిన్న రాముడు జ్యోతి ప్రజ్వలన చేసి నాటక ప్రదర్శన ప్రారంభించి ప్రసంగించారు.



గురువులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు (1992–93 పదవ తరగతి బ్యాచ్) ఒకే వేదికపై చేరారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ ఉల్లాసంగా గడిపారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు పూర్వవిద్యార్థులు.

కోతుల వేట...ఉపాధి బాట!

- నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్న పొద్దుటూరు వాసి
- కూలి చెల్లిస్తేనే వేట
- ఓర్వకల్లు మండలంలో వెయ్యి కోతులను పట్టేసిన వైనం



నన్నూరులో కోతులను బోన్‌లో బంధించిన దృశ్యం

ఓర్వకల్లు: కూటి కోసం..కోటి విద్యలు అన్నారు పెద్దలు. ఆ సూక్తికి ప్రత్యక్ష సాక్షి కడప జిల్లా, ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన కోతుల మల్లన్న. కోతులను పట్టుకోండంలో నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడు మల్లన్న. దీంతో ఈయన కోతుల మల్లన్నగా గుర్తింపు పొందారు. జనాన్ని భయపెట్టే కోతులనే మచ్చికపెడుతోంది మల్లన్న కుటుంబం. వారి ఎత్తులకు చిత్తుగా చిక్కుకపోతున్నారు వానరులు. ఏమాత్రం భయమే లేకుండా తనదైన శైలిలలో కోతులను పట్టుకోవడం చిన్న తనంనుంచే అలవర్చుకున్నాడు కోతుల మల్లన్న. ఈ క్రమంలో ఆదివారం నన్నూరు గ్రామంలో ఆ కుటుంబ వానరులను వేటాడాడు. కోతులను తమదైనశైలిలో చాకచక్యంగా పట్టుకొని, వాటిని ఓ బోనులో బంధించాడు. ఆయనను పలుకరించగా ఆసక్తికర విషయాలు తెలిపాడు. దాదాపు యాభైఏళ్లున్న కోతుల మల్లన్న ఇరవైఏళ్ల నుంచి కోతులను పట్టుకోవడం నేర్చుకున్నాడు. ఎవరైనా కోతులతో ఇబ్బంది పడుతున్నామంటూ వెంటనే అక్కడ వాలిపోతాడు. వాటిని బంధించి కూలి తీసుకునేవాడు. అయితే కోతుల బెడద ఎక్కువ కావడంతో ఆయనకు అదే వృత్తిగా మారిపోయింది. పంచాయతీ అధికారి, సర్పంచ్, గ్రామ పెద్దల కోరిక మేరకు కోతలను వేటాడుతాడు. వారితో కుదుర్చుకున్న ఒప్పంద మేరకు కూలి తీసుకుంటాడు. ఒక్కో కోతికి రూ. 100 వరకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వేటలో సుమారు–195 కోతులను పట్టుకున్నట్లు తెలుస్తుంది. అలాగే కన్నమడకల, రాగమయూరి, మిడుతూరు మండలంలోని గుడిపాడు తదితర గ్రామాలలో మొత్తం 1,000 కోతులను పట్టుకున్నట్లు సమాచారం. అధికారులు చొరువ తీసుకుంటే కోతులకు నిలయంగా మారిని ఓర్వకల్లు మండలంలో ఆ బెడద తీరనుంది.

ఉపాధిగా మారింది



నా చిన్నితనంలోనే కోతులను పట్టుకోవడం అలావాటు చేసుకున్నా. మాది నిరుపేద కుటుంబం కావడంతో పొట్టకూట కోసం ఈ పనిచేస్తున్నా. ఎక్కడైన కోతులు ఉన్నాయని ఫోన్‌చేస్తే అక్కడి వాలిపోతాం. వారితో ఒప్పందం కుదుర్చుకొని ఓ రేటును నిర్ణయిస్తాం. ఆ ఒప్పందం మేరకే కోతులను పట్టి వారికి అప్పగిస్తాం. అడవిలో నీరు, ఆహారం ఉన్న చోట వదలమని తనవంతుగా చెబుతా. ఎక్కడైన కోతుల బెడదతో బాధపడుతుంటే 80966–78482 నంబర్‌కు సంప్రదించండి.

– కోతుల మల్లన్న, ప్రొద్దుటూరు

కురిసిన చిన్నపాటి వర్షం... పొంగిన మురుగు కాల్వలు



కోడుమూరులో చిన్నపాటి వర్షానికే రోడ్డెక్కి పారుతున్న మురుగునీరు

కోడుమూరు రూరల్: కోడుమూరులో చిన్నపాటి వర్షానికే మురుగునీటి కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. పట్టణంలోని మెయిన్‌బజార్, మోమీన్ వీధి, తేరు బజార్, కొండపేటలలో మురుగునీరు రోడ్లెక్కి పారుతోంది. దీంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి కాల్వలు చిన్నగా ఉండడం, కాల్వలకు అడ్డదిడ్డంగా వంతెనలు నిర్మించడంతో ఈ దుస్థితి తలెత్తుతోంది. ఇకనైనా మేజర్ గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీటి కాల్వలను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏఐహెచ్ఆర్ఓ జిల్లా చైర్మన్ నియామకం

కర్నూలు కల్చరల్: ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ జిల్లా చైర్మన్‌గా పత్తికొండకు చెందిన కటారుకొండ సాయికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ లీగల్ (ఐ) రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రఫీ నియామక ఉత్తర్వులను ఇచ్చారు. దీంతో పాటు జిల్లా జనరల్ సెక్రటరీగా ఎం.గిరీష్, కార్యదర్శులుగా రంగన్న, గురుస్వామి, లీగల్ అడ్వైజర్‌గా మధు, సభ్యులుగా రఘు, ఖాజా హుస్సేన్, విజయ్, సురేంద్ర, సతీష్‌లను నియమించినట్లు తెలిపారు.

భర్త దాడిలో గాయపడిన మహిళ మృతి

కోడుమూరు రూరల్: మద్యం మత్తులో భర్త రోకలి బండతో దాడి చేసిన ఘటనలో గాయపడి భార్య ఆదివారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన దంపతులు సుంకన్న, లక్ష్మమ్మల కుమార్తె బోయ మల్లీశ్వరి(28)ని పదేళ్ల కిందట కల్లూరు మండలం బస్తిపాడుకు చెందిన రంగడుకు ఇచ్చి వివాహం చేశారు. కొన్నేళ్లపాడు వీరి కాపురం సవ్యంగా సాగింది. రంగడు మద్యానికి బానిసై పనికి వెళ్లకుండా భార్య మల్లీశ్వరీని నిత్యం వేధింపులకు గురి చేస్తుండేవాడు. దీంతో మల్లీశ్వరీ పుట్టినిల్లైన పులకుర్తికి వచ్చి కూలీపనులకు వెళ్తూ జీవనం సాగించేది. అయినప్పటికీ భర్త ప్రవర్తనలో మార్పు రాకపోగా, పులకుర్తికి వచ్చి భార్య అత్తమామలతో గొడవపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో జూలై 31వతేదీ రాత్రి మల్లీశ్వరీ తల్లి లక్ష్మమ్మతో కలిసి ఇంట్లో నిద్రిస్తుండగా తాగి వచ్చిన రంగడు మద్యం మత్తులో భార్య, అత్తపై రోకలిబండతో దాడి చేశాడు. అడ్డుగా వచ్చిన మామపై కూడా దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ మల్లీశ్వరీని కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలనరసింహులు తెలిపారు. కేసులో నిందితుడైన రంగడు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతురాలు మల్లీశ్వరీకి పదేళ్లలోపు ఒకు కమారుడు, కుమార్తె సంతానం.

పాణ్యం తహసీల్దార్‌గా నరేంద్రనాథ్‌రెడ్డి



పాణ్యం: పాణ్యం మండల తహసీల్దార్‌గా నరేంద్రనాథ్ రెడ్డిని ఉన్నతాధికారులు నియమించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లా నుంచి ఇక్కడి వచ్చిన ఫణికుమార్ సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు డీటీ రమాదేవి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై వినుతులు అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. అదేవిధంగా మండల అధికారులు కార్యక్రమానికి హాజరుకావాలని సూచించారు.



నిర్మాణంలో ఉన్న డబుల్‌లైన్

7న రాకపోకలు బంద్

- డబుల్‌లైన్ పనుల నేపథ్యంలో పాణ్యం రైల్వేగేట్‌ను మూయనున్న అధికారులు
- కౌలురు గ్రామం మీదుగా వాహనాల మళ్లింపు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని రైల్వే గేటును ఈనెల 7వ తేదీన(బుధవారం) రాకపోకలకు నిలపివేస్తున్నట్లు పాణ్యం సీఐ నల్లప్ప, తహసీల్దార్ రమాదేవి ఆదివారం తెలిపారు. డబుల్ లైన్ పనులకు అంతరాయం కలగకుండా ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటలకు వరకు రైల్లేగేటు మూసివేస్తున్నామన్నారు. అయితే ఈ రహదారి నుంచి అనంతపురం, తాడిపత్రి, బనగానపల్లె, కోవులకుంట్లతో పాటు పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు రాపోకలు సాగుతుంటాయి. వీటిని కౌలురు నుంచి భూపనపాడు, గోనవరం మీదుగా మళ్లిస్తున్నట్లు తెలిపారు. గోనవరం వద్ద ఉన్న జంక్షన్ వద్దనే వాహనాలను మళ్లిస్తున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు కూడా దారి ఉండదన్నారు. ప్రస్తుతం గేటు నంబర్ 170 నుంచి ఈ పనులు చేపడుతున్నారన్నారు. వాహనాదారులు, చూట్టు పక్కల గ్రామాల ప్రజలు గమనించాలన్నారు. వాహనాదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని వారు కోరారు.



పాణ్యం వద్ద ఉన్న రైల్వే గేటు

బీపీ నియంత్రణలో ఉంచుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్) ఉన్న ప్రతి ఒక్కరూ దానిని నియంత్రణలో ఉంచుకోవాలని కార్డియాలజిస్టు, కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ సూచించారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్ క్లబ్‌లో హైబీపీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ హైబీపీ ఎందుకు వస్తుంది, లక్షణాలు, చికిత్స, నివారణ పద్ధతుల గురించి వివరించారు. అనంతరం ఆయనను హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ భవానీప్రసాద్, కల్కూర చంద్రశేఖర్, సభ్యులు సన్మానించారు.

కాలనీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీ, గీతాముఖర్జీ నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ అదనపు జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా కాలనీల్లో సీపీఐ బృందం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని వారితో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీతాముఖర్జీ నగర్‌లో సచివాలయం, హెల్త్ సెంటర్లను నిర్మించాలని, రోడ్లను బాగు చేయాలని కోరారు. అలాగే వీకర్ సెక్షన్ కాలనీలోని ప్రజల ఇళ్ల పట్టాలను హౌసింగ్ బోర్డులో తాకట్టు పెట్టారని, వాటిని విడుదల చేయించాలని కోరారు. 60 ఏళ్లు దాటిన వారందరికీ పెన్షన్, అర్హులందరికీ రేషన్ కార్డులను మంజూరు చేయాలని కోరారు. నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, నాయకులు ఆశాబేగం, నాగేశ్వరమ్మ, సోఫియా, రాముడు, గౌస్ పాల్గొన్నారు.



వంతెనకు ఇరువైపులా మట్టి పేరుకుపోయి గడ్డి మొలచిన దృశ్యం



వంతెన దెబ్బతిని తేలిన కడ్డీలు

ప్రమాదకరంగా హంద్రీనది వంతెన !

- వంతెనకు ఇరువైపులా పేరుకుపోయిన మట్టి
- బీటలు, రంధ్రాలు ఏర్పడిన వైనం... పట్టించుకోని అధికారులు

కోడుమూరు రూరల్: కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా బళ్లారి రోడ్డులో హంద్రీనదిపై వంతెన ప్రమాదకరంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా పత్తికొండ, గుంతకల్, ఆలూరు, బళ్లారి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారిలో కోడుమూరు వద్ద హంద్రీపై దాదాపు 30ఏళ్ల కిందట నిర్మించిన వంతెన మరమ్మతులను ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. వంతెనకు ఇరువైపుల టన్నుల కొద్ది మట్టి పేరుకువడంతో వర్షపునీటితో పైపులైన్‌లు మూసుకుపోయాయి. వంతెనపై వాననీటి నిల్వ మట్టి పేరుకుపోవడంతో వంతెనకిరువైపులా అడుగున్నరకుపైగా గడ్డి సైతం మొలవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తుంది. రోజుల తరబడి వాననీరు నిల్వవుండడం, వాహనాల రాకపోకల వల్ల వంతెనపై భాగమంతా కడ్డీలు తేలి బీటలు బారాయి. అక్కడక్కడ చిన్న రంధ్రాలు సైతం ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోడుమూరు – బళ్లారి రోడ్డులో ప్రధానమైన హంద్రీనది వంతెనకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



బీటలుబారి రంధ్రాలు పడిన వంతెన